# విపశ్యన మాసపత్రిక

VOLUME:39 NO - 30 1 September, 2020

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

**"ధర్మవాణి"**

*తే ఝాయినో సాతతికా, నిచ్చం దళ్హపరక్కమా !*
*ఫూసన్తి ధీరా నిబ్బానం, యోగక్ఖేమం అనుత్తరం !!*

*– ధమ్మపదం – 23, అప్పమాదవగ్గో*

సతతం ధ్యానంచేసే సాధుజనులు, నిత్యం దృఢ పరాక్రమంతో రాగ-ద్వేషాలను మట్టుబెట్టు ధీరపురుషులు, ఉత్తమమైన యోగక్షేమాలు కలిగి ఉండి, నిర్వాణపథమును సాక్షాత్కారం చేసుకుంటారు.

# పూజ్య గురూజీ భారతదేశానికి వచ్చిన తరువాత ఎదురైన అనుభవాలు

పూజ్య గురూజీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధధర్మ సంపర్కంలోకి రావటం నుండి మొదలుకుని వారి ప్రారంభిక జీవితానికి సంబంధించిన అనేక వ్యాసాలు ముద్రింపబడ్డాయి. ఆయన భారతదేశానికి వచ్చి, విపశ్యన బోధన ప్రారంభించిన తరువాత ఎదుర్కొన్న అనుభవాలు మరియు ఆయన బోధించిన శిక్షణను ఇప్పుడు ప్రకాశింపచేస్తున్నాము. ఈ క్రమంలోనే – గోయంకా గారు రచించిన హిందీ పుస్తకం **ఆత్మకథన్ భాగ్ 2** యొక్క **పద్నాలుగవ భాగాన్ని** సమర్పిస్తున్నాము.

## భారతయాత్ర

### మహర్షి

సమయం గడుస్తూ పోయింది. నేను నా కుటుంబ, వ్యాపారిక మరియు సామాజిక బాధ్యతలను ముందుకంటే మరింత నేర్పుగా నెరవేరుస్తూ, నియమిత రూపంలో సాధనలో కూడా స్థిరపడుతూ వచ్చాను. మద్రాస్ నగరానికి యాత్రకు వెళ్లినప్పుడు మా పెద్దన్నయ్య బాలకృష్ణ, అక్కడకు వచ్చిన మహర్షి మహేష్ యోగి గారికి నన్ను పరిచయం చేయటానికి తీసుకుని వెళ్లాడు. వారిని కలిసినప్పుడు నా మనసెంతో ప్రసన్నత చెందింది. వారు మాతో – "నా పట్ల ఆదరభావం కలవారు ఒకరు నాకు ప్రపంచయాత్ర కొరకు టికెట్ ఇచ్చారు. కానీ భారతదేశం వెలుపల నాకెవరూ పరిచయస్తులు లేరు, ఎలా వెళ్ళాలో కూడా తెలియదు." అని చెప్పారు. అప్పుడు మేము వారిని, ఆ టికెట్‌తో కలకత్తా వచ్చి అక్కడ నుండి రంగూన్‌కు రమ్మని ఆహ్వానించాము. దానిని వారు స్వీకరించారు. "దక్షిణ-పూర్వ మరియు పూర్వ ఆసియా దేశాలతో నాకు సత్సంబంధాలున్నాయి. అక్కడున్న నా మిత్రులు, తరువాతి ఏర్పాట్లు చూసుకుంటారు." అని వివరించాము. వారి యాత్రలో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగబోవనే పూర్తి నమ్మకం నాకుంది.

అలా వారు రంగూన్‌కి వచ్చారు. 17 రోజుల పాటు మా ఆతిథ్యాన్ని స్వీకరించి మమ్మల్ని కృతార్థుల్ని చేశారు. విశేషంగా నేను ఎంతో ఉపకారం పొందాను. అన్నింటికంటే గొప్ప విషయం ఏమిటంటే, వారి కారణంగా మా కుటుంబ సభ్యులంతా ధ్యానమార్గం వైపుకు మొగ్గుచూపారు. విపశ్యన ద్వారా నేను మైగ్రేన్ నుండి ముక్తి పొందటమే కాకుండా, నా స్వభావంలో ఎంతో గొప్ప మార్పు వచ్చింది. అది చూశాక కూడా మా కుటుంబసభ్యులు ఎవరూ విపశ్యన శిబిరాలకు వెళ్ళటానికి సిద్ధంగా లేరు. అందుకు మొదటి కారణమేమిటంటే, కుటుంబ సభ్యులంతా భక్తిమార్గంలోనే ఉండేవారు, నిత్యం పూజలు చేస్తూ, భజనలు పాడటంలోనే నిమగ్నమై ఉండేవారు. రెండవది, బౌద్ధధర్మం అంటే సంకోచం ఉండనే ఉంది. అలాంటి వారు, మహర్షి గారి ప్రభావంతో అందరూ వారి నుండి మంత్రదీక్ష తీసుకుని ధ్యానమార్గంలో నడవటం మొదలుపెట్టారు. ఆ తరువాత వారందరూ విపశ్యన సాధన వైపుకు సులువుగా మళ్ళారు. రెండవది, మంత్రాన్ని ఆలంబనగా చేసుకుని నేనెప్పుడూ ధ్యానం చేసి చూడలేదు. కానీ ఊహించని స్థితిలో నేను కూడా మంత్రం ఆలంబనగా సాధన చేయటం జరిగింది. అలా చేయటం కారణంగా, విపశ్యన మరియు మంత్రధ్యానాల మధ్యనున్న భేదాన్ని నేను అనుభూతి స్థాయిలో చక్కగా అర్థం చేసుకునే అవకాశం కలిగింది.

రంగూన్‌లో ఉన్న రోజుల్లో మహర్షిగారు నాతో పాటుగా గురుదేవులు సయాజీ ఊ బా ఖిన్ గారిని కలవటానికి వచ్చేవారు. అక్కడ నేర్పబడే దానిమీద చర్చ జరుగుతుండేది. వారు నా సాధనకు సంబంధించిన అనుభవాలను కూడా వినేవారు. "మృణ్మయ శరీరమంతా చిన్మయమైపోయింది, ఘనత్వమనేది ఎక్కడా మచ్చుకైనా లేదు" అని నేను వారికి చెప్పాను. "ఈ స్థితి ఎల్లప్పటికీ అలాగే ఉండనప్పటికీ, ధ్యాన సమయంలో మరియు ఆ తరువాత ఎంతో సమయం పాటు నిలిచి ఉంటుంది. మధ్య మధ్యలో మనసు లోపలికి వెళితే, అటువంటి అనుభూతే కలుగుతుంది." అని నేను వారికి వివరించాను. ఇది విన్న తరువాత మహర్షి గారు, "ధ్యానానికి అంతిమ స్థితి ఇదే కదా. ఇంతకంటే ముందుకు ఇంకేదీ లేదు. ఇదే నిరాలంబ స్థితి. ఇక్కడకు చేరుకున్నాక, ధ్యానం యొక్క ఆధారాలన్నీ విడిపోతాయి. కేవలం చిన్మయమే చిన్మయం, కేవలం ఆనందమే ఆనందం ఉంటుంది. మరి మీకు ధ్యానపు అంతిమ స్థితి ప్రాప్తించింది అని మీ గురువుగారెందుకు చెప్పరు?" అని అన్నారు. నేను వారికి ఏమని సమాధానం ఇవ్వగలను? విపశ్యనలో ముమ్ముందు మరెన్నో స్థితులుంటాయి అని నాకు బాగా తెలుసు. నా సహచరులైన సాధకులు

ఎంతోమంది వాటిని ప్రాప్తించుకున్నారు, ఎంతోమంది ప్రాప్తించుకుంటున్నారు. నేను వారితో చెప్పలేకపోయినా, భవ–విముక్తి మార్గంపై ముందుకు సాగే క్రమంలో సాధనా సంబంధమైన ఎన్నెన్నో చిన్నా–పెద్ద స్థితులు ఉంటాయి అని నాకు తెలుసు. ఆయా స్థితులన్నీ కూడా వాటికి సంబంధించిన విశేషతలను కలిగి ఉంటాయి. అయితే అంతిమ లక్ష్యమైతే నిరాలంబ స్థితియే, అందులో మరో ఆలోచనే లేదు. అయినప్పటికీ, నేను ఏ అనుభవాన్ని అనుభూతి చెందుతున్నానో, దానిని "నిరాలంబ స్థితి" అని ఎలా చెప్పగలను? ఇక్కడైతే శరీరము, చిత్తము మరియు ఆ రెండింటి సంపర్కంతో ఉత్పన్నమయ్యే సంవేదనలనే అనుభూతి చెందుతున్నాను కదా, ఆ స్థితిని నిరాలంబమైనది అని ఎలా చెప్పగలను? ఇక్కడైతే శరీరము, చిత్తము మరియు ఆ రెండింటి సంపర్కంతో ఉత్పన్నమయ్యే సంవేదనలే అనుభూతిలోకి వస్తున్నాయి. శరీరాన్ని చిత్తం స్పర్శిస్తోంది, దాని కారణంగా అత్యంత సూక్ష్మస్థితి యొక్క సుఖవంతమైన లేదా చెప్పాలంటే ఆనందమయ అనుభూతి కలుగుతోంది. వాస్తవిక భవాతీత, లోకాతీత స్థితి ఇంకా ముందుంది. అక్కడ శరీరచిత్తాల అతిక్రమణ జరుగుతుంది అక్కడ ఇంద్రియ–క్షేత్రమంతా అతిక్రమించబడుతుంది, నిరోధించబడుతుంది. కానీ భారతదేశంలో బుద్ధ భగవానుని బోధనలు విలుప్తమైపోయాయి. దానితో భారతదేశపు అత్యంత ప్రాచీనమైన, ఆ కాలంలో ఎంతగానో ప్రాచుర్యంలో ఉన్న విపశ్యన విద్య మరియు ఈ విద్యకు చెందిన వివరణాత్మక సాహిత్యం కూడా పూర్తిగా విలుప్తమైపోయాయి. కాబట్టే ఉదయ–వ్యయ జ్ఞాన స్థితి నుండి భంగుర జ్ఞాన స్థితి వరకూ ఎదురయ్యే చిన్నా–పెద్ద అనుభూతులతో పాటు, భంగుర జ్ఞాన స్థితి నుండి ఇంద్రియాతీత, నిర్వాణ స్థితి వరకూ ఎదురయ్యే చిన్నా–పెద్ద అనుభూతులతో పాటు, భంగుర జ్ఞాన స్థితి నుండి ఇంద్రియాతీత, నిర్వాణ స్థితి వరకూ అనుభూతిలోకి వచ్చే అన్ని స్థితుల పేర్లు కూడా మనదేశంలో మరిచిపోబడ్డాయి. అలాంటి పరిస్థితిలో అనుభవపరంగా విషయం ఏంటో తెలుసుకోవటమనేది ఊహాకందని విషయం.

అయినప్పటికీ మహర్షిగారు చేసిన అత్యంత ఉపకారం ఏమిటంటే, వారు రంగూన్‌లోని మా కుటుంబసభ్యులనే కాకుండా, అక్కడ నివసిస్తుండే భారతీయుల్లో ఎంతోమందిని ధ్యానమార్గం వైపుకు ప్రేరేపితులను చేశారు. ఇక ఆశ్చర్యకర విషయమేమిటంటే, విపశ్యన విద్యతో పూర్తిగా సంతుష్టుడిగా ఉంటూ కూడా స్వయంగా నేను కూడా మంత్రధ్యానం వైపుకు లాగబడ్డాను. జరిగిందేమిటంటే, కుటుంబ సభ్యులంతా మహర్షి గారి చేత మంత్ర–దీక్షితులు అయ్యాక, కేవలం ఇలాయిచీ దేవి మాత్రమే మిగిలిపోయారు. ఆమె కూడా మంత్రదీక్షకు తయారుకాగానే మహర్షిగారు, "నేను వీరికి ఒంటరిగా మంత్రాన్ని బోధించలేను. భార్యాభర్తలు ఇద్దరూ కలిసి మంత్రం తీసుకోవాలి." అని చెప్పారు. దానితో, "నేను సాధనలో అంతిమ లక్ష్యం వరకూ చేరుకున్నానని స్వయంగా మీరే చెప్పారు కదా, మరి నాకు దానితో అవసరమేముంది?" అని నేను వారికి విన్నవించాను. దానితో వారు, "మీరు వారితో పాటుగా మంత్రం తీసుకోవద్దు, వారికి తోడుగా కూర్చోండి" అని చెప్పారు. అందుకు నేను అంగీకరించాను. సామాన్యంగా ఆయన సాధకులకు నెమ్మదైన స్వరంలో మంత్రాన్ని ఉపదేశిస్తారు. కానీ ఈసారి కొద్దిగా గట్టిస్వరంలో మంత్రాన్ని ఉపదేశించారు, దానిని నేను కూడా విన్నాను. ఆ తరువాత మేము అతిథిశాల నుండి క్రిందకు దిగి హాలులోకి వచ్చేశాము. అప్పుడు నాకు, ఎటువంటి ప్రయత్నం చేయకుండానే మంత్ర సంబంధిత తరంగాలు నా శారీరమంతటా తరంగితమవటం నేను గమనించాను. అలాగే సాధనలో కూర్చున్నప్పుడు కూడా ఏమాత్రం కదలకుండా మూడు గంటల పాటు కూర్చుండిపోయాను. ఆ విధంగా మంత్రాన్ని తీసుకోకుండానే మంత్రంలో దీక్షితుడినైపోయాను. నా విపశ్యన సాధన నా నుండి ఎప్పుడూ తప్పిపోలేదు. కానీ, ఈ రెండింటి మధ్యనున్న అంతరాన్ని తెలుసుకోవటంలో మంత్ర సాధన నాకెంతో ఉపయోగపడింది.

ఈ విధంగా మహర్షి గారు కేవలం భారతీయులకే కాకుండా, ప్రపంచమంతటా సంచరిస్తూ విశ్వంలోని అనేకులను మంత్రంలో దీక్షితులను చేసి వారికెంతో ఉపకారం చేశారు. వారు భారతదేశపు ఈ మంత్ర విద్యను విశ్వమంతా స్వీకరించేలా చేసి భారతదేశపు గౌరవాన్ని పెంపొందించారు.

## స్వామీ

రంగూన్‌లోని గోయంకా నివాసం యొక్క విశేషత ఏమంటే, ఇక్కడ భారతదేశపు సాధువులు, సన్యాసులు, భిక్షువులు, మునులు, సాహిత్యకారులు, కళాకారులు, సమాజసేవకులు, రాజకీయవేత్తలు మొదలగు సుప్రసిద్ధ వ్యక్తులు ఎంతోమంది ఎన్నోసార్లు ఆతిథ్యాన్ని స్వీకరించేవారు. నేను విపశ్యన సాధన ప్రారంభించిన ఒకటి–రెండు సంవత్సరాలకు స్వామీ కృష్ణానందగారు విచ్చేశారు. వారెంతో ప్రభావవంతులు. వారు జోధ్‌పూర్‌కు చెందిన రాజవంశీకులు. కొన్ని సంవత్సరాల పాటు జోధ్‌పూర్ న్యాయాధిపతిగా కూడా పనిచేశాక, సన్యాసం తీసుకుని హిమాలయాల్లో సాధన చేయటానికి వెళ్ళిపోయారు. అక్కడి నుండి 17 సంవత్సరాల తరువాత తిరిగి వచ్చి, సమాజసేవకు అంకితమైపోయారు. బహుశా వారి ఆశ్రమం వడోదరలో ఉండేది. కానీ వారి ముఖ్య కార్యక్షేత్రమైతే ఆఫ్రికా మరియు మారిషస్ దేశాల్లో ఉండేది. అక్కడ వారెంతో సుప్రసిద్ధ వ్యక్తిగా ఉండేవారు. వారి వ్యక్తిత్వం ఎంతో ప్రభావవంతంగా, జీవముట్టిపడే సాధు స్వభావంతో కూడుకుని ఉండేది. వారి స్వరమెంతో గంభీరంగా, వినసొంపుగా ఉండేది. వారు ఇంట్లోని పెద్ద హాలులో, "జయ రామ్, జయ రామ్, జయ జయ రామ్" అంటూ గానం చేయటం ప్రారంభిస్తే, కుటుంబసభ్యులు మరియు సమాజంలోని అనేకులు వారితో పాటుగా కీర్తనలు పాడుతూ తన్మయత్వంతో పరవశించిపోయేవారు.

వారితో కూడా విపశ్యనను గురించిన చర్చ జరిగింది. వారికి కూడా, ఇంత త్వరగా శారీరమంతటా చేతన మొదలుకాగలదనే నమ్మకం కలగలేదు. అత్యంత నిర్మల స్వభావాన్ని కలిగి ఉండి, అహంకారం లేనివారు కావటంతో, వారు ఎలాంటి సంకోచం లేకుండా, "నేను 17 సంవత్సరాల పాటు హిమాలయాల్లో సాధన చేస్తూ గడిపాను. కానీ నాకు శరీరంలోని కొన్ని భాగాల్లో మాత్రమే చైతన్యం కలిగిందే కానీ, అన్ని భాగాల్లోనూ కలగలేదు." అని వారు చెప్పారు. స్పష్టతతో కూడిన వారి మాటతీరుకు నేనెంతో ప్రభావితుడినయ్యాను. ఆయన నాతో పాటుగా గురుదేవులు సయాజీ ఊ బా ఖిన్‌ను కలవటానికి ఆశ్రమానికి వచ్చారు. ఈ చిన్మయ స్థితి కేవలం నాకే కాకుండా కాస్త ముందోవెనకో అందరికి ప్రాప్తిస్తుంది అని తెలుసుకుని ఆయనకెంతో ఆశ్చర్యమేసింది. మయన్మార్ నుండి భారతదేశానికి వచ్చిన సంవత్సరంలోపే ఢిల్లీలో ఆకస్మాత్తుగా ఆయన నాకు తారాసపడ్డారు. మేమిద్దరమూ కలిసి ఎంతగానో ప్రసన్నత చెందాము. ఆ తరువాత

ఆయనకు నేనెప్పుడూ కలవలేదు. బహుశా ఆయన తన కర్మభూమి అయిన ఆఫ్రికాకు వెళ్ళిపోయి ఉండవచ్చు. ఆయన యొక్క స్పష్టమైన మాటతీరు మరియు వారి సరళ స్వభావాన్ని గుర్తుకుతెచ్చుకుంటే వారి పట్ల గౌరవభావమే కలుగుతుంది.

## మహాత్మా

మయన్మార్ నుండి విపశ్యన విద్యను తీసుకుని భారతదేశానికి వచ్చాక, బర్మాలోని భారత సంతతి కొరకు ఒక అతిముఖ్యమైన బాధ్యత చేపట్టాల్సిన అవసరమేర్పడింది. బర్మా ప్రభుత్వం పుస్తకాల దిగుమతిని నియంత్రించిన కారణంగా, అక్కడ నివసిస్తున్న భారతీయులకు పాఠ్యపుస్తకాల కొరత ఏర్పడింది. ముఖ్యంగా హిందీ పాఠ్యపుస్తకాలకు, అందులోనూ ప్రాథమిక తరగతుల పాఠ్యపుస్తకాలకు మరింత కొరత ఏర్పడింది. కాబట్టి నేను నాలుగవ తరగతి వరకూ విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను స్వయంగా వ్రాసి రామక్రిష్ణ మిషన్ తరపున ముద్రింపజేశాను. నేను ముద్రింపజేసిన పుస్తకాలను పాఠ్యపుస్తకాలుగా గుర్తించటానికి వాటికి "రాష్ట్రభాషా ప్రచార సమితి" వారి తరపున అంగీకారం పొందటం అనివార్యమైంది. కాబట్టి ఈ పాఠ్యపుస్తకాల ప్రతులను కొన్నింటిని వర్ధాలోని వారి కార్యాలయానికి పంపటం జరిగింది, కానీ అక్కడి నుంచి ఎటువంటి సమాధానమూ రాలేదు. దానితో వారిని కలవటం తప్పనిసరైంది. కాబట్టి వర్ధాలో ఒక శిబిరాన్ని నిర్వహించటంతో బాటు "రాష్ట్ర భాషా ప్రచార సమితి"లో సంబంధిత మంత్రి గారు **శ్రీ రామేశ్వర్ దయాళ్ దూబే** గారిని కలవటానికి వర్ధా వెళ్లాను. ఆయనెంతో మంచివారు. నేను పంపిన పుస్తకాలు ఆయన ముందుగానే చదివి ఉన్నారు. అవి ఆయనకెంతో ఉపయోగకరంగా అనిపించాయి. నేను కలవగానే ఆయన పాఠ్యపుస్తకాలకు అంగీకారం తెలిపారు. కొద్దిసేపు మాట్లాడిన తరువాత, "ఒకవేళ మీరు నాతో పాటుగా సేవాగ్రామంలోని మహాత్మా గాంధీ గారి ఆశ్రమానికి వెళ్ళాలనుకుంటే రండి, వెంట తీసుకుని వెళతాను." అని చెప్పారు. నేను ప్రసన్నతతో అంగీకారం తెలిపాను. ఆయన నన్ను వర్ధా నుండి సేవాగ్రామ్‌కు తీసుకుని వెళ్ళారు. అక్కడ గాంధీజీ కోడలు శ్రీమతి నిర్మలా గాంధీ కలిసారు. ఆమె మమ్మల్ని వెంట తీసుకెళ్ళి ఆశ్రమమంతా చూపించారు. గాంధీజీ యొక్క నివాస కుటీరాన్ని కూడా చూపించారు. కొద్దిసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడిన తరువాత విపశ్యన గురించిన ప్రస్తావన వచ్చింది. మనసులోని వికారాలను తొలగింపజేసే విద్య కూడా ఒకటుందని విని ఆమెకు ఆశ్చర్యమేసింది. దానితో ఆమె, "ఒకవేళ మీరు ఇక్కడ శిబిరాన్ని నిర్వహిస్తే నేను స్వయంగా తగిన ఏర్పాట్లు చేస్తాను." అని చెప్పారు. నాకెంతో ప్రసన్నత కలిగింది. మహాత్మా గాంధీ గారి ఆశ్రమంలో విపశ్యన శిబిరాన్ని నిర్వహించటమనే సూచన ఎంతగానో నచ్చింది. వారు శిబిరానికి తగిన ఏర్పాట్లు చేశారు. అందులో ఇతరులతో పాటుగా దాదాపు 10-12 మంది వయోజనులు కూడా పాల్గొన్నారు. వారందరూ మహాత్మాగాంధీ గారితో కలిసి పనిచేసిన వారు. అందరూ వారికి సహాయకులే. శిబిరం విజయవంతమైంది. పదవరోజు వారిలో ఎంతోమందికి భంగురస్థితి ప్రాప్తించింది. వారిలో కొందరికి శరీరం పైపైననే సుఖవంతమైన, సూక్ష్మ తరంగాల ప్రవాహం తెలిసివచ్చింది, దానిని మనం అర్ధ-భంగుర ధారాప్రవాహంగా పిలుస్తాము. కానీ మరికొంతమందిలో శరీరం లోపలా-బయటా అంతటా చిన్ని చిన్ని తరంగాల ధారాప్రవాహపు అనుభూతి కలిగింది. దానిని మనం పూర్ణ భంగుర స్థితిగా పిలుస్తాము. సాధకులకు ఎంతో ప్రసన్నత కలిగింది, నాకు కూడా ఎంతో ప్రసన్నత కలిగింది.

వారిలో ఒకరు- **"శ్రీ అన్నా సాహెబ్ సహస్రబుద్ధుడు."** ఆయన నాతో - "బాపూ ఏమి చేసేవారో నాకిప్పుడు అర్థమయింది." అని చెప్పారు. అప్పుడు నేను విషయమేమిటో తెలపమని అడిగినప్పుడు, ఆయన ఈ విధంగా చెప్పారు. "ఆయన సాయంకాలం ప్రార్థనాసభను నిర్వహించేవారు, అప్పుడప్పుడూ అందులో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొనేవారు. బాపూ వేదికపైన చక్కిలముక్కిలం వేసుకుని, కళ్ళు మూసుకుని కూర్చునే వారు. మిగిలినవారంతా సామూహికంగా రామ కీర్తన పాడుతుండేవారు.

**"రఘుపతి రాఘవ రాజా రామ్, పతిత పావన సీతారామ్,**

**ఈశ్వర్ అల్లా తేరే నామ్, సబ్ కో సన్మతి దే భగవాన్."**

అంటూ ప్రజలు సామూహికంగా గానం చేస్తూ చప్పట్లు కొట్టేవారు. ఇక్కడ మహాత్మా గారు కళ్ళు మూసుకుని మౌనంగా, నిశ్చలంగా కూర్చుండేవారు. ఇది చూస్తూ మేము ఆపుకోలేక ఒకరోజు, "మీరు మా అందరితో రామకీర్తన పాడిస్తారు, చప్పట్లు కొట్టిస్తారు. కానీ మీరు మాత్రం కీర్తన పాడరు, చప్పట్లు కూడా కొట్టరు." అని అడిగాము. దానికి వారు, "నేను ఇంతకంటే ఎంతో ఉన్నతమైన పని చేస్తాను, అందుకే అందులోనే నిమగ్నమై ఉంటాను." అని చెప్పారు. అది విన్నాక, మాలోని కుతూహలం మరింత పెరిగింది. దానితో మేము, "అంత ఉన్నతమైన పని మీరు ఏమి చేస్తారు?" అని అడిగాము. దానికి ఆయన, "నేను ఈశ్వరున్ని దర్శనం చేసుకుంటూ ఉంటాను." అని చెప్పారు. మాలోని ఉత్సాహం మరింత పెరిగి, "మేమెన్నడూ ఈశ్వరున్ని దర్శనం చేసుకోలేదు, కాబట్టి చెప్పండి, మీరు దర్శనం చేసుకునే ఆ ఈశ్వరుడు ఎలా ఉన్నాడు?" అని అడిగాము. అప్పుడు ఆయన, "ఏదైనా భౌతిక, సాకార ఈశ్వరుడైతే ఆయన అస్థిత్వాన్ని గురించి భిన్నాభిప్రాయాలు రాగలవు, వచ్చే అవకాశాలున్నాయి. అయితే "సత్యమే" ఈశ్వరుడు. అందులో ఎటువంటి భిన్నాభిప్రాయానికీ తావులేదు. నేను ఆ సత్యం రూపంలో ఉండే ఈశ్వరుడినే దర్శనం చేసుకుంటాను." అని చెప్పారు. మాలోని ఉత్సుకత మరింత పెరిగి, "మరి భౌతికంగా లేకపోతే ఎలా ఉన్నాడు?" అని అడిగాము. అప్పుడు ఆయన, "నేను కళ్ళు మూసుకుని కూర్చోగానే అంతర్ముఖుడనౌతాను, అలాగే తల నుండి పాదాల వరకూ శరీరమంతటా చైతన్యపు ప్రవాహం నడుస్తుంది. దానితో నాకెంతో శాంతి లభిస్తుంది, ఎంతో ఆనందం అనుభూతిలోకి వస్తుంది. నేను అందులోనే నిమగ్నమైపోతాను. అదే నాకు ఈశ్వరదర్శనం. ఆ స్థితిలో అప్పుడప్పుడు తీసుకునే నిర్ణయాలు ఎక్కువమటుకు సరైనవిగానే ఉండేవి." అని చెప్పారు.

ఆ తరువాత అన్నా సాహెబ్, "వారు విపశ్యన సాధననే చేసేవారు అని నాకు ఇప్పుడు అర్థమయింది. ఎందుకంటే మాకు కూడా ఎనిమిదవ రోజు, తొమ్మిదవరోజు ఇలాంటి చైతన్య ప్రవాహమే అనుభూతిలోకి రావటం మొదలయింది." అని చెప్పారు.

మహాత్మాగాంధీ గారికి భంగుర స్థితి అనుభూతిలోకి వస్తుండేది అని స్పష్టంగా తెలుస్తుంది. దానినే వారు నిర్గుణ, నిరాకార సత్యరూప ఈశ్వరునిగా భావించేవారు. బహుశా శరీరమంతటా కలిగే ఆనందమయ చైతన్యాన్నే నేటి భారతదేశంలో నిత్యము, శాశ్వతము, ధృవము, నిర్గుణ, నిరాకార ఈశ్వరునిగా భావించేలా ప్రచారం జరిగి ఉండవచ్చు. సాధారణంగా ఈ స్థితిని ప్రాప్తించుకోవటం అంత సులభం కాదు. ఈ స్థితి వరకూ చేర్చే సరళమైన సాధనా విధి విపశ్యననే. ఈ స్థితికి చేరుకోవటానికి ఎన్నో సంవత్సరాలు పట్టవచ్చు. పూజ్య గురుదేవులు సాయాజీ ఊ బా ఖిన్ - "ఏ వ్యక్తయితే గత జన్మల్లో

విపశ్యన సాధన చేసి ఉంటారో, గత జన్మలో ఎవరికైతే మృత్యు సమయంలో, తనలోని సంవేదనల పట్ల అనిత్యబోధ అనుభూతితో పాటు అప్రమత్తత కొనసాగుతూ ప్రాణం పోతుందో, అట్టి వ్యక్తికి మానవుల లేదా దేవయోనిలో పునర్జన్మ లభిస్తుంది. అటువంటి వారికి ఎలాంటి అభ్యాసము, ఎవరి నుండి మార్గదర్శకమూ లేకుండా తనంతట తానుగానే శరీరంలో ఈ ప్రవాహం అనుభూతిలోకి రావటం మొదలవుతుది." అని చెప్పేవారు. బహుశా మహాత్మా గాంధీ గారి విషయంలో అలాంటిదే ఏదో జరిగి ఉంటుంది. నేను ఖచ్చితంగా ఇదే అని చెప్పలేను. వారు ఎక్కడా ధ్యాన సాధనైతే చేయలేదు. ఆయనకి "శ్రీమద్ రామచంద్ర" గారితో సన్నిహిత సంబంధాలైతే ఉండేవి. కానీ వారి నుండి ధ్యానం నేర్చుకున్నట్లుగా ఎటువంటి సూచనలైతే లేవు.

ఇప్పటి వరకూ నిర్వహించిన శిబిరాల్లో, కొద్దిమంది సాధకులకు, విపశ్యన సాధన లభించగానే శరీరమంతటా చైతన్యపు ప్రవాహం అనుభూతిలోకి వచ్చింది. వారికి చిన్నప్పటి నుండీ అప్పుడప్పుడు అలా జరుగుతుండేదని, దాని అర్థమేమిటో వారికి అప్పట్లో తెలియరాలేదు అని చెప్తుండేవారు. ఒకరిద్దరైతే వాళ్లకి ఇటువంటి ప్రవాహ అనుభూతి కలుగుతుండటంతో, వారు దానిని మానసిక రోగంగా భావించి, దానిని దూరం చేసుకునే ప్రయత్నంలో మనోచికిత్సకుల ఉచ్చుల్లో చిక్కుకుని, ఎన్నెన్ని మందులు తిన్నారో వారికే తెలియదు. దానితో వారు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనారు.

విపశ్యన సాధనలో పాల్గొన్న తరువాత, వారికి ఈ విధమైన అనుభూతి ఏ రకమైన జబ్బు కాదని, పైపెచ్చు ఇట్టి అనుభూతి పట్ల అనిత్యబోధ పెంపొందించుకుని, ఏ రకమైన రాగ–ద్వేషాలకు లోను కాకుండా సమతను బలపరుచుకుంటే, ఇది ముక్తి మార్గంలో ముందుకు వెళ్ళటానికి ఎంతో బలమైన ఆలంబనగా నిలుస్తుందని, ఇది మంచిదే అని అర్థం చేసుకున్నారు.

భారతదేశంలో విపశ్యన విద్య అంతరించి ఎన్నో తరాలైంది. కాబట్టి భంగుర స్థితికి గురించిన అవగాహన దాదాపుగా ఎవరికీ లేదు. ఇటువంటి పరిస్థితిలో భంగుర స్థితికి చేరుకోవటం ఎంతో కష్టం. ఒకవేళ చేరుకున్నా, ఇట్టి అనిత్యస్థితి పట్ల నిత్యతను ఆక్షేపించి, దానినే భవయాత్ర యొక్క అంతిమ లక్ష్యంగా భ్రమించి, అక్కడే ఆగిపోవటం జరుగుతుంది. ఇట్టి అనిత్య స్థితిని నిత్యమైనదిగా, అంతిమ స్థితిగా భ్రమించి ఇక్కడే ఆగిపోయిన కారణంగా, సాధనలో ముమ్ముందు అనుభవంలోకి వచ్చే ఇతర మహత్తర స్థితులెన్నింటినో తెలుసుకోవటం అసాధ్యమవుతుంది. కాబట్టి ఎన్నో జన్మల నుండి అంతర్మనసు అట్టడుగు లోతుల్లో అణగదొక్కబడిన భవ కర్మ–సంస్కారాలు ఉబికివచ్చి బయటపడే పని అసలు మొదలుకాదు. ఇక ఈ స్థితి అత్యంత ఆనందదాయకంగా ఉన్న కారణంగా మార్గమధ్యనున్న ఈ ధర్మశాలనే అంతిమావస్థగా భావిస్తే, వాస్తవిక సత్యమైన భవాతీత, ఇంద్రియాతీత, నిత్య, శాశ్వత, అమృత స్థితిని ఎలా సాక్షాత్కారం చేసుకోగలం?

– తరువాయి భాగం వచ్చే సంచికలో.

## మంగళ మృత్యువు

ధమ్మసిరి విపశ్యన కేంద్ర ఆచార్యుడు శ్రీ థామస్ క్రిస్‌మాన్ గారు తన 78వ ఏట, 3 ఆగస్టు 2020 నాడు డల్లాస్, టెక్సాస్ (అమెరికా) లోని వారి గృహంలో శాంతిపూర్వకంగా కాలం చేశారు. ఒక విజయవంతమైన వ్యాపారస్థుడు మరియు న్యాయవాది అయిన శ్రీ థామస్ గారు తన 40 ఏళ్ళ ధర్మసేవలో గోయంకా గారి "ధర్మ–ఆశయాన్ని" నెరవేర్చటానికి ఎంతో మహత్తరమైన, సార్థకమైన సేవ చేశారు. ఆయన, శ్రీ గోయంకాగారు నిర్దేశించిన విపశ్యన బోధనా సామాగ్రిని రికార్డింగ్ చేసే మహత్తరమైన బాధ్యత చేపట్టి భావితరాల మేలుకు కారణమయ్యారు. వాటి కారణంగానే ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో విపశ్యన సాధనను బోధించటానికి కావలసిన పూర్తి సామాగ్రిని రూపొందించే అవకాశం ఏర్పడింది. అంతేకాకుండా ఆయన dhamma.org వెబ్‌సైట్‌ను స్థాపించటంతో పాటు గోయంకా గారి రికార్డింగులకు, వ్యాసాలకు న్యాయపరమైన హక్కుల్ని పొందటంలో కూడా సహాయం చేశారు. భార్య టీనాతో పాటుగా ఆయన మధ్య అమెరికా ప్రాంతపు క్షేత్రీయ సమన్వయ ఆచార్యుడిగా ఉన్నారు.

ఆయన ఎక్కడున్నా, సుఖ–శాంతులతో వర్ధిల్లాలి, ముక్తి–మార్గంలో పురోగతి సాధిస్తూపోవాలి.


రెండు సంవత్సరాలకు చందా రూ 100/– **విపశ్యన తెలుగు మానపత్రిక** జీవిత చందా రూ. 500/–
ప్రచురణ తేది: ప్రతినెల 30/31 పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2 వెల: రూ 5/–
**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**
**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.